# భోజనం

శశిశ్వర్

"ఆగండి నేనూ వస్తున్నాను" గడప దాటబోతున్న నాకు శ్రీమతి కేకవంటింటిలోంచి వినిపించింది.

"ఎక్కడికి" చెప్పులు వేసుకుంటున్న రేఖను అడిగాను.

"కూరలు తెచ్చుకోవాలి. మీతోపాటు బస్‌స్టాప్‌దాకా వస్తాను. మీరు ఆఫీస్‌కెళ్ళండి. నేను మార్కెట్‌కు వెళ్తాను"

"సరేపద" అంటూ తాళం వేసి తాళం చెవి రేఖకిచ్చాను.

"ఏం కూరలు వండుతున్నావ్" నడుస్తూ అడిగాను.

"ఏం వండమంటారో చెప్పండి అవే చేస్తాను" ఎప్పుడూ అడగని ప్రశ్న అడిగానేమో నా వైపు చూస్తూ అంది.

నాకు ఏం చెప్పాలో తెలియలేదు "నీ ఇష్టం రేఖా? ఏదో ఒకటి చేయ్" అన్నాను.

"సరే నేను వెళ్తున్నాను. అదిగో మీ బస్ వస్తోంది" అంటూ కదిలింది రేఖ.

మధ్యాహ్నం క్యాంటిన్‌లో తింటున్నప్పుడు ఉదయం రేఖతో జరిగిన సంభాషణ గుర్తుకు వచ్చింది. రేఖ కూడా



నేను ఉదయం ఏడుగంటలకు వెళ్తే సాయంకాలం నాలుగు వరకూ ఫ్యాక్టరీలోనే ఉండిపోతాను. ఉదయం ఏడుగంటలకే వంట చేయడం వీలుకాకపోవడం వల్ల మధ్యాహ్నం ఫ్యాక్టరీ క్యాంటిన్‌లో లంచ్ చేస్తుంటాను.

"ఎటూ నా భోజనం క్యాంటిన్‌లోనే కదా? నీకు కావలసింది వండుకో, నా సలహా ఎందుకు!" నవ్వుతూ అన్నాను.

"సరే రాత్రికి ఏం వండమంటారో చెప్పండి" ఎలా అయినా నాకిష్టమయిన వంటలు తెలుసుకోవాలనేమో మళ్ళీ అడిగింది.

"సాయంకాలం వచ్చిన తరువాత ఆలోచిద్దాం నా బస్‌స్టాప్ వచ్చేసింది నేను ఆగిపోతాను" అన్నాను నడక ఆపి.

"ఏం కావాలో చెప్పండి. నేను ఇప్పుడే కూరలు తెస్తాను. మళ్ళీ సాయంకాలం వెళ్ళడం కష్టం" మళ్ళీ అదే ప్రశ్న.

ఇప్పుడు భోం చేస్తూ ఉంటుంది. తనకు కావలసిన కూరలు వండుకుని, తియ్యని పెరుగుతో తింటూ ఉంటుంది. ఆ ఆలోచన రాగానే క్యాంటిన్ తిండి తినాలనిపించలేదు. అన్నం మానేసి ఆలోచనల్లో పడ్డ నన్ను చూసి ప్రక్కనున్న మిత్రుడు "హలో? ఎక్కడో ఊహల్లో ఉన్నట్టున్నావ్. తొందరగా తిను. లంచ్ టైమ్ అరగంట మాత్రమే" అన్నాడు భుజం తడుతూ.

నేను ఊహల్లోంచి బయటపడి తిండితినటం ప్రారంభించాను. నా ఫ్రెండ్ ప్రక్కనున్న మరో మిత్రునితో చెప్తున్నాడు "కొత్తగా పెళ్ళయిన వాళ్ళతో ఇదే చిక్కు ఉన్నట్టుండి ఊహాలోకాల్లోకి వెళ్ళిపోతుంటారు" నా ఆలోచనలకు నేనే చిన్నగా నవ్వుకున్నాను.

* * *

పన్నెండు గంటలు కావస్తోంది. లంచ్ టైమ్ దగ్గర పడుతోంది. క్యాంటిన్‌కు వెళ్ళి భోజనం చేయాలంటే ఎలాగో ఉంది. కరెక్ట్‌గా అప్పుడే ఒక ఆలోచన తట్టింది. అర్ధరోజు సెలవు తీసుకొని, సరాసరి ఇంటికి వెళ్ళి రేఖ చేసిన వంటలు ఆరగించి, రేఖతో మ్యాట్నీకి వెళ్తే పోయ్?

ఆ ఆలోచన రాగానే ఎంతో సంతోషం కలిగింది. వెంటనే ఆఫీసర్‌ను అడిగి సెలవు తీసుకున్నాను. ఆయన కూడా ఎందుకు అని అడగలేదు.

కాలింగ్ బెల్ నొక్కగానే "ఎవరూ" అంటూ రేఖ ప్రశ్న

"నేనే" అన్నాను ఇవతలి నుంచి. గొంతు గుర్తుపట్టి వెంటనే తలుపు తీసింది.

"ఏమిటి అప్పుడే వచ్చేశారు" ఆనందం నిండిన మొహంలో ఆశ్చర్యార్థకాన్ని చూపిస్తూ అడిగింది.

"ఈ రోజు మధ్యాహ్నం నీ చేతివంట తినాలనిపించి ఆఫీసుకు దుమ్మాకొట్టి వచ్చేశాం. ఆకలి బాగా ఉంది వెంటనే వడ్డించెయ్యాలి" అంటూ డైనింగ్ టేబుల్ దగ్గరకు వెళ్ళి కూచున్నాను.

నేను వచ్చేముందు రేఖ భోజనానికి కూచోబోతోందేమో ప్లేటు మంచినీళ్ళు అక్కడ పెట్టి ఉన్నాయి.

'ఆకలి బాగా ఉందా!' ఒక అరగంట ఆగండి మీకూ వండేస్తాను అంటూ వంటింటిలోకి దారితీసింది.

'ఫరవాలేదు. నీవు భోజనానికి కూచున్నట్టున్నావ్. నీ భోజనం అయిన తరువాత నాకు వండుదువు గాని'

నేను ఊహల్లోంచి బయటపడి తిండి తినటం ప్రారంభించాను. నా ఫ్రెండ్ ప్రక్కనున్న మరో మిత్రునితో చెప్తున్నాడు 'కొత్తగా పెళ్ళయిన వాళ్ళతో ఇదే చిక్కు ఉన్నట్టుండి ఊహాలోకాల్లోకి వెళ్ళిపోతుంటారు'



అన్నాను.

లోపలి నుండి సమాధానం రాలేదు. అయినా నాకు కుతూహలంతో రేఖ ఏం వండిందో చూద్దామని గిన్నెల పైన మూతలు తెరిచాను. ఒక గిన్నెలో అన్నం ఉంది. రేఖకు కూడ అది సరిపోదేమో. ఇంకో ప్లేటులో నేను ఉదయం తినగా మిగిలిన చపాతి ఉంది. ఇంకో గిన్నెలో పెరుగు దాని పక్కనే ఆవకాయ. మిగతా గిన్నెలన్ని కడిగి ఉన్నాయి.

అంటే రేఖ తన కోసం ఏమీ వండుకోలేదా! రోజూ ఇలాగే చేస్తోందా ఏమిటి! అస్సలు ఏమి లేకుండా ఈ ఆవకాయ, పెరుగు వీటితోనే భోజనం కానిచ్చేస్తోందా.

వంటింట్లోకి వెళ్ళాను. రేఖ అప్పుడు కూరలు తరుగుతోంది "నీ కోసం కూరలేవి చేసుకోలేదా" అడిగాను.

"నా ఒక్కదాని కోసం ఎక్కడ చేసుకుంటాను నా కంత ఓపిక లేదు బాబు"

తనకు చేసుకోవడానికి ఓపిక లేదు. కాని ఒకవైపు భోజనం చేయకుండా నా కోసం చేసే ఓపిక వచ్చిందా! అప్పుడు అనుకున్నాను. ఓ స్త్రీ నీవు నీ స్వార్థం చూసుకొన్న రోజున మగవాడికి దిక్కెవ్వరు అని.

"సరే. వంట ఆపేయ్. ఈ రోజు హోటల్లో భోజనం చేసి, అక్కడినుండి అలాగే మ్యాట్నీకి వెళ్దాం" అన్నాను.

ఏ భావమూ ప్రదర్శించని కళ్ళతో నా వైపు చూసింది. దగ్గరకు వెళ్ళి ఆప్యాయంగా ఆ కన్నులపై ముద్దు పెట్టుకున్నాను.

*